# బ్యాంకి బుచ్చిరాజు

శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ గారు

[వెనుకటి సంచిక తరవాయి]

"పోషితులు గానివారిని రక్షింపను చక్రి రాజై యుండు"నను భాగవతసూక్తి యథార్థమైనది. ఎట్టిపోషణసౌకర్యములు లేకున్నను, బుచ్చిరాజు కొమార్తెకు మూడేండ్లు వచ్చినవి. పున్నమ్మ మరల గర్భిణియైనది. ఈ మారు తండ్రి వచ్చి స్వయముగా బిలిచినను పున్నమ్మ పుట్టింటికి వెళ్లలేదు. మరల నూరూపాయలు బ్యాంకీలో వేసికొనవచ్చును గదా యని పున్నమ్మను పుట్టింటి కంపుటకు బుచ్చిరాజు విశ్వప్రయత్నముచేసి విఫలుడైనాడు. పున్నమ్మపట్టు రాహుపట్టుగదా!

భార్యకు పురుడుపోయు దిక్కులేమిచే మూడేండ్లనాడు యిల్లువీడిపోయిన తల్లిని బుచ్చిరాజు బలవంతపెట్టి తీసికొనిరావలసి వచ్చినది. ఒక శుభముహూర్తమున పున్నమ్మ ప్రసవించినది. మగశిశువు కలిగినాడు. అమవస్యన మూడవనాటి సాయంకాలమున పశ్చిమాకాశాంగన మోమున గన్పట్టు స్వల్పకాంతిని గూడిన చంద్రికారేఖవోలె బుచ్చిరాజు ముగమున ఆనందరేఖ పొడసూపి నిరంతరము లుబ్ధవ్యసనరుజాపీడితుడై మొగము ముడుతలు వడి యెట్టి కళాకాంతులులేక వెలవెల లాడుచుండెడి యాతని వదనమునకు నూతన సోయగమును గూర్చెను. ఎట్టి పేద నరునకైన, ఎట్టి లుబ్ధమానవునకైన కుమారోదయ మంత హర్షదాయకము కాబోలు!

ఉదయించినవాడు వంశోద్ధారకుడగు తనయుడగుటచే సంతోషముతో బుచ్చిరాజు వలసిన వస్తువులలో సగమునకు సగమైన తెచ్చియిచ్చుటచే వివరింపవలసినంత జగడములు లేకనే పదిదినములు వెళ్లినవి. పదునొకండవనాడు బారసాలగూడ చేసికొని పిల్లవానికి 'అబ్బయ్య'యని తండ్రి పేరుబెట్టి బుచ్చిరాజు పితృ ఋణమును దీర్చుకొనెను. కోడలికి పురుడుబోసి భాగీరథమ్మ మరల కొమార్తెయింటికి వెళ్లిపోయినది. అత్తగారు వూరికి వెళ్లునప్పుడు బట్టలు పెట్టవలెనని పున్నమ్మ యుబలాటపడినది. కాని బుచ్చిరాజు చల్లగా పొరుగూరువెళ్లి తల్లివెళ్లిన తరువాత యింటికి చేరుకొనినాడు. మన బుచ్చిరాజు పక్షపాతిగాడు పెట్టుపోతలలో; తల్లితోబుట్టువులను, భార్యాబిడ్డలను నొక్క విధముగనే చూచును.

పిల్లవాని కొక్క యేడాది వచ్చినది. బుచ్చిరాజు కొమారుని మహా మమకార ముతో నెత్తుకొనుచు నేరవ్వంతతినుబండ మునో కొడుకుకు బెట్టుచు మురియుచుండెను. కొమారుని యెడనైన బుచ్చిరాజు వాత్సల్య ముతో ప్రవర్తించుట పున్నమ్మకు మన స్సున కొకవిధముగా సంతోషముగా నున్నను ప్రత్యేకముగా పిల్లపై నుదాసీనత వహించి పిల్లవానిని నెత్తి నెక్కించుకొనుట యకల్మష హృదయయగు పున్నమ్మకు దుస్సహముగా నుండెను. "ఇద్దఱు మనకడుపునబుట్టినవారే, కొమారుడైననేమి; కొమార్తె యైననేమి; చెట్టునుండి కోసికొనివచ్చినవా రెవరు? కన్న కడుపునెడ స్త్రీపురుషవివక్షత పెట్టుకొని పక్షపాతబుద్ధితో నుండుట పాపహేతువు. తెచ్చిన వస్తువు యిరువురకు సమానముగా బెట్టుడు; లేదా, మొదలే తీసికొనిరావలదు. ఒకకంటిలోసున్నమును ఒకకంటిలోవెన్నను బెట్టుకొనుట న్యాయముగా"దని గయ్యాళితన ముగా పెద్దగొంతుకతో అఱచి చెప్పినను పున్నమ్మ సబబైనమాటలనే సర్వదా చెప్పు చుండును. కాని బుచ్చిరా జామాటలను చెవిని పెట్టడు; తనపని మానడు. పున్నమ్మ "యికసాత్వికమార్గముసరిగా"దనుకొని దార్జ న్యపద్ధతికి బూనుకొనినది. ఎప్పుడు పిల్లవాని కేమిపెట్టునో యని వేవిధముల కనిపెట్టియుండి యమాంతముగా పిల్లవానిచేతిలోనిపదార్థము నూడబెరికికొని సగముచేసి పిల్లకుబెట్టి మిగి లిన యర్థము పిల్లవాని కిచ్చివేయును. భార్య యొక్క దార్జన్యయుతధర్మపద్ధతికి బుచ్చిరా జేమియు చేయనేరక గుడ్లు మిటకరించి యూరకొనును.

పిల్లకై దేండ్లు వచ్చినవి. పిల్లవానికి మూ డేండ్లు వచ్చినవి. దీపావళి పండుగ వచ్చినది. బాణాసంచు కానలెనని పిల్లలు గోల; డబ్బు తగులబెట్టుట బుచ్చిరాజు కిష్టములేదు. కాన యూరిలో టపాకాయలు కాల్చుకొను వేళ యింట పిండివంట సంతరి పెట్టినచో టపాకాయపోరు తప్పునని యూ హించి బుచ్చిరాజు ఒకశేరు మినుములు, ఒకసవాశేరు నేయి తెచ్చి గారెలు వండుమని భార్యను నిర్బంధించెను. 'టపాకాయలు లే పోయినను పిల్లలకు గారెలైన తినుభాగ్య మొదవిన దంతియే చాలు'నని పున్నమ్మ దానికే యొడబడెను. సాయంత్రము గారెలు వండువేళకు బుచ్చిరాజు భార్యచెంత గారెల బుట్టవద్ద కూర్చుండి బుట్టలో వేసినగారెలన్ని నోటవేసికొనసాగెను. నిండుపుసేతిలో నెర్రగా పిండిబెట్టి బండిచక్రములవలె పెద్దవిగా వండిన తొలిగారెలెల్లదాదాపుయిరువదివఱకు బుచ్చి రాజు కుక్షిలోబడి ఆహుతైపోయినవి. బుచ్చి రాజు పొట్టలో నిక నర్థగారె పట్టు తావులేదు. గట్టున త్రేపుగూడ వచ్చినది. ఇక నాలుగు గారెలు బాణలిలో వేగుచున్నవి. అవి భార్యాబిడ్డలకు చాలును. కాన మిగిలినపిం డిని మఱునాడు రొట్టెముక్క చేసికొనుటకు నిలువచేయవలెనని బుచ్చిరాజు ఆలోచన. ఆమాట సాత్వికముగా చెప్పినచో భార్య వినదు; దార్జన్యముగా చెప్పినచో మొదలే వినదు. కాన, సలహా పూర్వకముగా చెప్పిన

బాగుగా నుండునని యుద్దేశించి 'ఇదిగో' పొద్దు పోయినది; పండుగపూట; వీథిలో టపాకాయలు, దీపాలు ముచ్చటగా చూడకుండా ఈ పిండివంట పీడేమిటి; ఈపూటకు చాలించు; రేపు రొట్టెముక్కనా వేసుకుందాము" అనెను.

పు—వినాయకుడవలె నీవు పొట్టనిండా తిని మేము తినకుండా చాలించమంటున్నావా? పిల్లలకూ నాకూ కావద్దూ.?

బు—పిల్లవాడు నాతోనే తిన్నాడా? ఇక పిల్లకూ నీకూ, అవి చాలవ్వా?

పు—ఇరవై గారెలు తింటేకాని నీకు చాలలేదు. నాలుగుగారెలు మాయిద్దరికా? మరల రేపు నీకు రొట్టె నైవేద్యమా? ఇటువంటి సలహా నాకు చెప్పవద్దు; లేచిపో.

బు—సంపాదించుకొనే ముండావాడిని నాకు ఎక్కువవద్దా!

పు—చేసేదానికో?

బు—అవిచాలు; ఇక చాలించు; పిండి ఉంచు; ఆడదాని కింతకన్నా ఎందుకు?

పున్నమ్మకోపముతో మండిపడి ప్రొయ్యిలోనికొరివిబయటకు తీసినది. ఆకొఱకంచుతనపై విసరునేమోనని బుచ్చిరాజు వీథిలోనికి పరుగెత్తినాడు. పున్నమ్మ తలుపుగొళ్లెం పెట్టుకున్నది. ఒకపావుగంటలో మరిపది గారెలు బుట్టలో పడినవి. ఇంతలో బుచ్చిరాజు పెద్దశోకముపెట్టుచు, "తలుపుతీయవే, కొంపమునిగిందే, చేయిపోయిందే" అని కేకపెట్టుచు వచ్చినాడు. తొందరపడుచు పున్నమ్మవచ్చితలుపుతీసి "ఏంమునిగిం"దనను. "చెయ్యికాలిపోయింది. వాళ్లపిల్లవాడు తోటావేశాడు. చేయికాలింది. మంట-మంట - కొబ్బరినూనె - నవనీతం - సున్నపుతేట-చెయ్యా-చెయ్యా! అబ్బా! అబ్బా" అని బుచ్చిరాజు గోలెత్తెను. పున్నమ్మగాభరాతో పిండివంట చాలించి కట్టెలార్పి, పచ్చిపిండిని, గారెలను మూతబెట్టి భర్తకు వైద్యముచేయుటకు మైలపడినది. ప్రొయిలో మంట తగ్గినతరువాత బుచ్చిరాజు చేతిమంటకూడ తగ్గినది. ఆరాత్రి గడచినది. మరునాడాలుమగల జగడములో రాత్రికాల్పు అబద్ధమనియు పిండివంట చాలించుటకు చేసిన యుక్తి నియు తేలినది.

## ౨

బుచ్చిరాజునకు మూడవ సంతానము కలిగినది. ఈశిశువు మరల ఆడపిల్ల. బుచ్చిరాజు మరచిపోయిన చింత మరల చిగురించినది. ఇంటిలో యితరాడసాయము లేదు. అన్నియు బుచ్చిరాజు చేతిమీదనే రావలెను. బుచ్చిరాజు ఆడపిల్లమీది యీసుచే వలసినవస్తువు లీయడు. ఇరుగు పొరుగు అమ్మలక్కలెవరైన సాయముచేయ దలచినను, బుచ్చిరాజు వారిని నమ్మి యింటిలోనికి రానీయడు. కస్తూరి కావలెననియు, ఇంగువ కావలెననియు, వెల్లుల్లి కావలెననియు, ఆముదము కావలెననియు,మంత్రసానిగోల—బుచ్చిరాజు మూకవలె,బధిరునివలెమౌనము. ఎట్లెట్లో పది దినములు గడచి నీళ్లుపోసికొనినది పున్నమ్మ. కానిపథ్యపానములు సరిగాజరగకయు,నాహార

పుష్టిలేకయు, పున్నమ్మకు ప్రాణోపద్రవకరమగుజబ్బు చేసినది. ఈసంగతి తెలిసి తండ్రి వచ్చి పున్నమ్మను తమయింటికి తీసికొనివెళ్లి మందు యిప్పించినాడు. మృత్యుముఖము నుండి బయటపడి పున్నమ్మ మూడు మాసములకు మరల పెనిమిటివద్దకు వచ్చినది. పున్నమ్మ జబ్బుపడుటవలన శిశువునకు పాలు లేవు. ఏపుణ్యాత్మురాలో దయయుంచి పోసెడి కొంచెముపాలు పిల్లకు చాలునవి కావు. పల్లెటూరిలో నేవస్తువైనను, కొనుటకు దొరకుటరిది. ఉచితముగా నిచ్చువారు చాలినంత యీయరు. పున్నమ్మ పిల్లకుపాలుచాలక నీళ్లు నెక్కువగా కలిపిపోయుచుండెడిది. పిల్ల యెల్లప్పుడు ఆకలిచే రోదన. ఆఆవుపాలైనను పిల్లకు పడక నిక్కాకచే యెండిపోయి జ్వరముకూడ తగులసాగినది. 'మందు తెచ్చిపెట్టు'మని పున్నమ్మ భర్తను యాచించెను. కాని యతడు వినిపించుకొనలేదు. నెలదినములు జ్వరము ఒక్కవిధముగా కాసి పిల్ల పుల్లవలె శుష్కించినది; కాళ్లు ఉబ్బుచూపినవి. 'మందుతీసికొనిర'మ్మని పున్నమ్మ భర్తను మరల ప్రార్థించినది. "నావద్ద డబ్బులేదు; డబ్బునీయకుండ మందు నెవ్వరిచ్చెదరు? దైవయోగమున్న నేమందు నక్కఱలేదు. అదే నయమగు"నని బుచ్చిరాజు జవాబిచ్చెను. ఇక మగనికి చెప్పిన కార్యము లేదని పున్నమ్మ పిల్లను బుజముపై వేసికొని తానే వైద్యునింటికి వెళ్లెను. పొరుగిల్లెఱుగనిది పున్నమ్మ. చూడుడు! ఆకడుపుతీపు; అభిమానమును చంపివేసినది. పున్నమ్మ వైద్యుని మందడుగ "మీఆయన పరమలోభి. అవసరముతీరిన డబ్బునిచ్చువాడు కాడు. మీకు మందు లూరక రావు. రెండురూపాయలిచ్చిన గాని మందిచ్చుటకు వీలుగాదు" అని యావైద్యుడేవియో రెండుమాత్రలను చేతిలో బెట్టెను. పున్నమ్మవద్ద డబ్బులేదు సరిగదా, ఒడలున చిన్నమెత్తుబంగారము లేదు. రెండు రూపాయలు వైద్యున కెట్లిచ్చును! పాపము! కన్నుల నీరుతుడుచుకొనుచు పున్నమ్మ మరల యింటికివచ్చెను. ఇంటికివచ్చినవెంటనే పున్నమ్మ "పూజారిమల్లయ్య రెండురూపాయలిచ్చిన మందు నిచ్చెదననెను. కావున రెండురూపాయలి"మ్మని భర్తతో పెద్దజగడము పెట్టుకొనెను.

బు—నావద్ద యెఱ్ఱని యేగాని లేదు. రెండు రూపాయ లెక్కడ తెచ్చేది? నీవు యెంత యేడ్చినాసరే, డబ్బుపని నావల్ల జరగదు.

పు—ప్రాణముమీద వచ్చిన బిడ్డకు రెండు రూపాయ లిచ్చి మందు యిప్పించ జాలక పోతే ఇక నీవుద్యోగ మెందుకు? ఉన్న డబ్బు ఆ బ్యాంకిలో పూడ్చకపోతే రెండు రూపాయలుపెట్టి పిల్లకు మందు యిప్పించ రాదా!

బు—బ్యాంకిలో! ఏబ్యాంకిలో? నేనా! నా పన్నెండు రూపాయల జీతంలోనా!! బ్యాంకిలో నిల్వగూడానా!!!

పు—అబద్ధమాడవద్దు; క్రిందటి శనివారమే గదా, తెనాలి పోష్టాఫీసులో 30 రూపాయలు కట్టివచ్చింది!

బు—ఎవరు చెప్పింది?

పు—ఎవరైతేనేమి, ఎవరో ఒకరు. నిజమా, అబద్ధమా?

బు—అది మనసొమ్ము కాదు.

పు—మనసొమ్ము కానిది మనపేర బ్యాంకిలో యెందుకు పడుతుంది?

బు—అది వేఱేబాపతు.

పు—ఏబాపతైతే నేం? జీతంవచ్చినాక యియ్యవచ్చు, లేకపోతే అప్పు తేండి.

బు—నాకు ఋణము పుట్టదు.

పు—నీకు ఊరిలో ఋణము పుట్టదు; కాని ఇల్లో అన్నంగూడా పుట్టదు. నాపిల్ల జబ్బు యెక్కువగా వుంది. మందుకు రెండురూపాయలు తెచ్చేవఱకు నేను వంట చేయను. పిల్లతోపాటు మనముగూడా చావవలసిందే.

అని శోకము పెట్టుచు పున్నమ్మ పిల్లవద్ద కూర్చున్నది. ఊరిలో పూటకూలియిల్లు లేదు. ఇంట పున్నమ్మవంట లేదు. స్వయముగా వండుకొనినచో భార్య మట్టిపాలు చేయునే కాని పెట్టుకొని తిననీయదు. కాన బుచ్చిరాజు ఆదినిభార్యగూడ ఆపూట పస్తు. సాయంత్ర మైనది. ఈపూటనైన భార్యతో మంచిమాట లాడినగాని కూడుదొరకదని బుచ్చిరాజుకు తోచినది. కాన తిన్నగా భార్యవద్దకు వచ్చి "ఈయూరిలో నెవరినడిగినను ఋణమీయ లేదు. తెల్లవారుజామున లేచి తెనాలి వెళ్లి పగలు జాము ప్రొద్దెక్కునప్పటికి రూపాయలు తెచ్చెదను. నడుచుటకు శక్తియుండవలెను గదా, ఈపూటనైన వంటచేయవా?"యనెను. ప్రొద్దుటినుండి మగనిని పస్తుంచినందులకు పున్నమ్మ మనస్సు పీకుచుండెను. మఱియు రేపు రూపాయలు తెచ్చెదనని యాసగూడ చూపెను గాన పున్నమ్మ వెంటనే కిమ్మన కుండ లేచి వంటచేసి మగనికి బిడ్డలకు పెట్టి తానుగూడ భుజించెను. ఆరాత్రి రెండుగంటలనుండి పిల్లకు ఆయాసముగూడ పుట్టెను. తెల్లవారుజామున నే పున్నమ్మ భర్తను లేపి "పిల్లకు ఆయాసంగూడా పుట్టింది. తొందరగా వెళ్లి డబ్బుతీసుకరారా"యని దీనముగా నడిగెను. "పొద్దున్నే బ్యాంకిలో డబ్బు యివ్వరు. పదిగంటలనుంచీ యిస్తారు. జాముప్రొద్దెక్కగానే బయలుదేరిపోతే వెంటనే పైకం తీసుకొని రావచ్చు"నని బుచ్చిరాజు రెండవసారి తిరిగి పడుకొనెను. మగవాడాసురబుద్ధితో చరించుచుండ కండ్లు పుండ్లు పడునట్లేడ్చుట తప్ప యాడుదేమి చేయగలదు?

ఉదయము బుచ్చిరాజు యెప్పటివలె పాఠశాలకు వెళ్లెను. కాని తెనాలి వెళ్లలేదు. మరల పదిగంటలకు యింటికి వచ్చెను. పిల్ల ఆయాసముతో మూల్గుచున్నది. భార్య దుఃఖముతో నేడ్చుచున్నది. బుచ్చిరాజు కాకలితో కడుపుమాడుచున్నది. కాన "తెనాలి వెళ్ల మంటివిగదా! వంట చేయలేదా?" యనెను. "పిల్లకు మందుకు రూపాయలు తెస్తానంటిరే ఏవి? పిల్లచూడండి ఎట్లా బాధపడుతున్నదో! ఈబిడ్డను యిట్లావదలి వంటచేయడమెట్లా? డబ్బుకు వెళ్లిరండి. ఇంతలో వంటచేస్తాను" అని పున్నమ్మ జాలికరముగా పలికెను. ఇంతలో పొరుగింటియమ్మ యొకతెవచ్చి "పున్నమ్మా, ఎందుకు బాధపడతావు; పిల్ల నీదైతే యింతజబ్బే రాదు. తొందరగా వంటచేసుకొని

నాలుగు మెతుకులు తినండి" అనెను. ఆమాటలచే పున్నమ్మ మరింత బెంగపడి "డబ్బో! మందో! బిడ్డో!" యని పెద్దగా విలపింపసాగెను. డబ్బు తెచ్చి బిడ్డకు మందు వేయించిన బ్రదుకునను పున్నమ్మ మూఢవిశ్వాసమును మరల్పలేక యింట భోజనము లభించునాశ లేక బుచ్చిరాజు మిటమిటలాడు నెండలో తెనాలి వెళ్లెను.

బుచ్చిరాజు వెళ్లిన యొక గంటకు పిల్ల ప్రాణము పోయినది. పున్నమ్మయు, పిల్లలును గొల్లున నేడ్వసాగిరి. నల్వురు వచ్చి చూచు నప్పటికి బుచ్చిరాజు తెనాలి వెళ్లినట్లు తెలిసెను. బుచ్చిరాజుకొఱకు మనిషినంప యిరుగుపొరుగువారు పున్నమ్మకు సాయము గూర్చుండిరి.

మనిషి వెళ్లునప్పటికి బుచ్చిరాజు పూటకూటింట భోజనముచేసి బొట్టు తుడుచుకొని బ్యాంకిలో వేసిన సొమ్ము తీయుటకు జేతులాడక చిడిముడిపడుచు తపాలాకచ్చేరి యరుగుపై తారాడుచుండెను. ఇంతలో మనుష్యుడు సమీపించి "అయ్యా! మిమ్ములను వెంటనే పిలుచుకొనిరమ్మన్నారండీ!" యనెను.

బు—ఎందుకు? ఎవరు?

మ—పెద్దమేస్టరుగారు. జబ్బుగానున్న తమ కుమార్తె—

బు—పోయిందా?

మ—ఆఁ!

బు—నిజంగా, ఖాయపు మాటేనా?

మ—నిజమేనండీ, పున్నమ్మగారు తల పగుల గొట్టుకొని యేడుస్తున్నారు.

బు—అయితే వైద్యావసరము తీరినట్లే.

మ—అయ్యో! పిల్లే పోయిందంటే వైద్య మెవరికయ్యా?

ఒకమహాభారమును దించినట్లుగా బుచ్చిరాజు హృదయము తేలికపడెను కాని యొక బిందువైన రాలలేదు కన్నులనుండి. వచ్చిన మనుష్యునితోపాటు బుచ్చిరాజు త్వరితముగా స్వగ్రామమునకు బయలుదేరెను. బుచ్చిరాజు చిన్నతనమున తెనాలి నాటకసంఘములలో చెలరేగి తిరిగినవాడగుటచే లేనిది యున్నట్లును యున్నది లేనట్లును నటించుటలో గడు చతురుడు. అందు శోకరసాభినయమునందు బుచ్చిరాజు కడు నిపుణుడు. నేడు బుచ్చిరాజు చంద్రమతియో దమయంతియోయై నేడ్చునని ప్రకటించిన ప్రేక్షకులు పండులుగట్టి వచ్చెడివారు. నాటివిద్య బుచ్చిరాజు నేడు స్వప్రయోగమునకు వినియోగింప దలంచెను. లేకున్న పున్నమ్మ తనను నిలువనీయదని బుచ్చిరాజుకు భయము. బుచ్చిరాజు దుఃఖాభినయమును, గ్రామపు పొలిమేరవద్ద నారంభించి క్రమక్రమముగా వృద్ధిపొందించి భార్యకు పదిబారల దూరమునకు వచ్చునప్పటికి యఖండము గావించెను. రసపోషణయందు మెలకువ లెఱిగిన నటకుడు రసస్ఫూర్తి యందు నున్మాదియై మితిమించి చరించి యపహాస్యము పాలైనట్లు కుడిచేత నుత్తరీయముతో కన్నీళ్లు నద్దుకొనుచు నెడమచేత ముక్కుసీళ్లి చీదనేయుచు, "అయ్యో! నాకన్నతల్లీ! నాకడుపు నెంతచిచ్చు పెట్టిపోతివే! ఈకడుపుచిచ్చు నెట్లు భరించేదే! అమ్మా! డబ్బుపోయినా బిడ్డ

బ్రతికితేచాలు ననుకొంటినే అమ్మా! తల్లీ! సొమ్ము తెచ్చి ఒక్కమాత్ర వేసిందాకా ఉండక పోతినే అమ్మా! నాసొమ్ము కెంతలో ఋణము తీర్చితో యునావే అమ్మా! పదిరూపాయ లైనా పోసి మందు యిప్పించాలనుకొంటినే అమ్మా! ఎంతలో ఎంత చేసితివే! మా అమ్మా, మా తల్లీ! మా అమ్మా, మా తల్లీ!" అని పిల్ల పైని నేలపైననుబడి దొరలి దొరలి ఏడ్చిన బుచ్చిరాజు దొంగ ఏడుపు సగులపరిహాసమునకును, పిల్లకు జబ్బుచేసినది మొదలు చిక్కి సగమై, నేడు పిల్లపోవుటచే మఱింత మాఱాచుచు, జుట్టుచెరిగి, కురులు వీడి, కన్నీళ్లు స్రవింపగా రూపెత్తిన శోకదేవతవలె నున్న పున్నమ్మ కడుపుమంటకును కారణమైనది. బుచ్చిరాజు దుఃఖమొకింత తగ్గగనె పున్నమ్మ యినుమడించిన దుఃఖముతో పిల్లకు జబ్బుగా నున్న సమయములో మందుమాకు లొసగి బాగుచేయుటకు ప్రయత్నింపక, పైస ఖర్చు పెట్టుట కనుమతింపక, చచ్చినతరువాత బుచ్చ నపుటేడుపు లేడ్చుచున్న బుచ్చిరాజు యక్కృత్యములన్నియు కడిగిపోయుచు బ్యాంకి పిల్ల విత్తో గుండుగంట లేడ్చినది. అంతటితో బుచ్చిరాజు అభినయము పూర్తియైనది; పున్నమ్మ కడుపుమంట తగ్గినది.

## ౮

బుచ్చిరాజు పిల్లపోయిన కొన్ని దినములకు ఒక భీమాకంపెనీ ఏజంటు గ్రామమునకు వచ్చి బుచ్చయ్య పాఠశాలకు గూడ వచ్చెను. పాఠశాలలోని యుపాధ్యాయులు నలుగురు ఆయన చుట్టుచేరి మాట్లాడుచుండిరి. సందర్భవశమున నా ఏజంటు "అయ్యా! అనేక మంది వందలకొలది రూప్యములను సేవింగ్సు బ్యాంకిలో దాచుచుందురు. కాని దానివలన వారికేమిలాభమో?" అని యా ఏజంటు మాట పూర్తిచేయకపూర్వమె బుచ్చిరాజు కన్ను లెఱ్ఱచేసి కోపముతో మండిపడుచు "ఎవరయ్యా, నీవు, మమ్ములను వెక్కిరించడానికి? మేము సేవింగ్సుబ్యాంకిలో దాచుకుంటే నీకేమి, గోతిలో పూడ్చుకుంటె నీకేమి? పెద్దమనిషిగా వచ్చి నవాడవు పెద్దమనిషితరహాగామాట్లాడ వలెనుగాని యిటువంటి యధిక్షేపణలు తగవుగాదు" అనెను. ఏజంటు తెల్లపోయెను. తక్కిన యుపాధ్యాయులు గూడ విభ్రాంతు లైరి. అంత బుచ్చిరాజు ఉపాధ్యాయులను జూచి "చూచారా, ఈపెద్దమనిషి, నేను సేవింగ్సుబ్యాంకిలోడబ్బు వేశానని యెవరో కుట్టుకుంకో చెవిలో వ్రాదితే ఆమాటలు పట్టుకొని నన్నిక్కడ వెక్కిరించవచ్చాడు! ఇతనెవరు, నేనెవరు? ఇతను నన్నాక్షేపించేవాడా? ఇదుగోనయ్యా! ఈవ్వారినుండి తిన్నగా వెళ్లుచుకుంటె ఇటు వంటి ప్రసంగాలు చేయకు"మనెను. ఉపాధ్యాయులు పకపకనవ్విరి. ఆ ఏజంటు "ఏమిటయ్యా! అట్లా పేలుతావు. నీకు మతిలేదా యేమిటి? నీవు సేవింగ్సుబ్యాంకిలో సొమ్ము దాచినసంగతి నాకేమి తెలుసు? మాటసామెతగా చెప్పిన మాటకు మండిపడతావేమిటి? ఈవ్వారి నుండి తిన్నగా బోక నాకేమీ? తలగొట్టి మొలనే యిస్తావా? ఎవడిచ్చాడయ్యా, నీకీమేష్టరుద్యోగ"మనెను. అంత వ్యవహారము ముదురునని ప్రధానోపాధ్యాయుడు కలుగజేసికొని "ఆయన లోకములో మాటచెప్పెనుగాని నీ సంగతిగా"

దని బుచ్చిరాజును మందలించి "అయ్యా! ఆయనకు కొద్దిదినముల క్రిందట పిల్లపోయినది. ఆ విచారముచేత మతిచలించినది; కోపపడకం" డని యేజంటును బతిమలాడి వివాదము నుపశమింపజేసెను. నాటినుండి పిన్నపెద్దలచే లోలోన ననుకొనబడుచున్న బ్యాంకి పేరు బహిరంగమై స్థిరరూపమును దాల్చెను. ఉడికిలువారిని యుడికించ నెల్లరకు వేడుక యేకదా! వ్యవహారములు చేసికొనెడి పెద్దమనుష్యులు, మంచినీళ్లకేగెడిమగువలు, పనిపాటులకేగెడికాపుజనులు, పాఠశాలలకరిగెడి బాలబాలికలు బుచ్చిరాజునుజూచి "బ్యాంకి, బ్యాంకి" యని యఱచుటయు, నాతడు నానాతిట్లు తిట్టుచుండుటయు నిత్యవేడుకయ్యెను. అంతటితో యూరుకొనక గ్రామజనులు:

"పంతులు పంతులు బుచ్చయ్యా
పైకం బ్యాంకిలొ దాచయ్యా
మందువేయక పిల్లనుజంపి
దొంగయేడ్పుతో దొర్లయ్యా!
బ్యాంకిలొ పైకం స్టోర్
పెనిమిటిపెండ్లము పోర్
నోటిమాటలు జోర్
పెట్టడమంటే తార్ "

అని బుచ్చయ్యపై పదములుగూడ కట్టిరి. ఆపదములు వినగనె బుచ్చిరాజుకు ఒడలు మండి మఱింతతిట్టుటయు రాళ్లు విసరుటయు, చేతికందినపిల్లలను చావగొట్టుటయు గావింపసాగెను. బుచ్చిరాజు అల్లరిచేసినకొలది పిల్లలపదములు మెండయ్యెను గాని తగ్గలేదు. ఒకనాడు బడి వదలగనె పిల్లలందఱు జతలుగా నేర్పడియొకరు "బ్యాంకిలో పైకంస్టోర్?" యనిన తెండవవారు 'పెనిమిటి పెండ్లము పోర్' అని యీవిధముగా పాడుకొనుచు పోసాగిరి. బుచ్చిరాజు అప్పుడే యాపిల్లల బట్టి కొట్ట దలచియు లేడిపిల్లలవలె బరుగెత్తెడి యాబాలుర పట్టజాలక విఫలుడై మధ్యాహ్నము వీరిని తరగతిలో శిక్షింపదలచి యింటికి వెళ్లెను.

మధ్యాహ్నము పిల్లలందఱు బడికి వచ్చిరి. బుచ్చిరాజు తనతరగతిలోని బాలురను "అరే! ప్రొద్దున నాపైపాటలు పాడినకుంకలెవరో లేచి నిలుచోండిరా" యనెను. ఒక్కరు లేవలేదు. "అరే! ప్రొద్దున నాపై పాటలుపాడిన వెధవలు కూర్చోండిరా" యనెను. అందఱు లేచినిలువబడిరి. బుచ్చిరాజు కోపము పట్టజాలక అందఱనొక్కమాఱు చిత్తమువచ్చినట్లు బెత్తముతో గొట్టెను. పిల్లలంద ఱొక్కమాఱు గొల్లున నేడ్చిరి. ఈవిధముగా రెండుమూడుమాఱులు జరిగెను. బుచ్చిరాజుకు వెఱచి చాలామంది పిల్లలు బడికిరా మానిరి.

పైన పిల్లలతిండ్రులు "బుచ్చిరాజు మా పిల్లల నక్రమముగా గొట్టుచున్నాడు గాన నాతనిపై చర్యజరుపవలసిన" దని పాఠశాలాధికారులకు విజ్ఞప్తి నంపిరి. ప్రధానోపాధ్యాయుడుగూడ 'బుచ్చిరాజు దండనవలన పిల్లలు బడికివచ్చుటలే'దని పైవారికి దెలియబఱచెను. పైకాగితములు చూచుకొనినవెంటనే యొక అధికారి పాఠశాల పరిశీలననిమిత్తము వచ్చెను. అధికారి వచ్చెనని తెలిసిన వెంటనే బుచ్చి

నాటి నలిగిన చింపులు చెప్పులపై ప్రేలాడు చుండ, మట్టిమూకుడువలె మాసిన కనుబడు చుండు పిల్లకమ్మల యుత్తరీయమును తలకు చుట్టి యేమి గుడ్డచే నతుకులమర్చిన తెల్ల కోటు తొడుగుకొని మోకాళ్లదిగని యంగ వస్త్రమును గట్టి, భయభక్తులతో మెల్లని యడుగులు వేయుచు పాఠశాలకు వచ్చెను.

కొంతసేపటికి అధికారిగూడ బడికివచ్చి ప్రధానోపాధ్యాయునితోపాటు పెద్దతరగతులలో గొంతసేపు మసలి నెమ్మదిగా బుచ్చిరాజు తరగతికి వచ్చెను. తాను కూర్చుండెడి కుర్చీ యధికారి కొసగి చేతులుకట్టుకొని బుచ్చిరాజు అధికారివెనుక నిలువబడెను. అంత యధికారి కోపముతో చిడిముడిపడుచు "బుచ్చిరాజు!" అనెను.

బు—అయ్యా!

అ—నీప్రవర్తన యేమాత్రము బాగుగా లేదు. నీయుద్యోగము నిలువదుసుమా!

బు—అయ్యా! పదునాలుగువత్సరములనుండి యుద్యోగము చేయుచున్నాను. ఏనమరుడ నైనను యొక్కరు ఆక్షేపింప లేదు. పిల్లలను పరీక్షించి చిత్తగించండి నాలోపమున్న దేమో!

అ—నీవన్నమాట యట్లుండుము. సంవత్సరారంభమున నీతరగతిలో నిరువదినలుగురు బాలురు ప్రవేశించినట్లు తెలియుచున్నది. ఇపు డారుగురు బాలురుమాత్రమే నిత్యము బడికి వచ్చుచున్నారు. ఈలోప మెవరిది?.

బు—చిత్తము! ఏకారణముననో బాలురు రాకున్న నేనేమిచేయుదును? విద్యాబోధ యందు కించిత్తు లోపము లేకుండ పాటు పడుచున్నాను.

అ—ఇందు నీలోపము లేదనుట నే నొప్పుకొనను. నీవు బాలురను నిలువబెట్టి కొట్టుచున్నావటగదా!

బు—చిత్తము, లేదు.

అ—ఇదిగో! అర్జీ! తల్లిదండ్రులు స్వయముగా నాకు బంపిరి. ఇది యబద్ధమా!

బు—చిత్తము! పిల్లలవిధేయులుగా బ్రవర్తించుచున్నప్పుడు తండ్రియైన దండింపకుండ జాలడు. అందులో యుపాధ్యాయుడు దండింపకుండుట దుస్సాధ్యము.

అ—పిల్లలకు కంటిబెదరుండవలెను గాని బెత్తముతో రాక్షసముగా గొట్టుట పాఠశాలానియమములకు విరుద్ధము.

బు—చిత్తము; నాకు తెలియును. పిల్లలు నాకు కన్నబిడ్డలవంటి వారు. వారియెడ క్రూరముగా నేను ప్రవర్తించిన దబద్ధము. అంత అధికారి బాలురవైపు చూచి "ఏమీ, మీపంతులుగారు మిమ్ము కొట్టినారా" యనెను.

పి—అవునండీ!

అ—ఎన్నిమారులు?

పి—మూడుమారులు.

అ—అందఱను కొట్టెనా; లేక కొందఱను కొట్టెనా?

పి—అందఱును.

అ—ఎందులకో తెలియునా?

పిల్లలు మాటాడలేదు.

అ—ఏమీ! మీకు తెలియదా?

ఒకచిన్నబాలుఁడు—బ్యాంకి అంటే కొట్టినా రండీ!

అ—బ్యాంకి యేమిటి బుచ్చిరాజు?

బు—"వాళ్లిపిండము, నాపిండము! తెను కెందుకు స్వామీ" యని బుచ్చిరాజు తన యధికారి మాటను గూడ మఱచి కోపముతో జవాబిచ్చెను. అంత అధికారి యాగ్రహముచే కన్నులెఱ్ఱచేసి, బాలురవైపు చూచి "బ్యాంకి వృత్తాంతమేమిటో చెప్పు"డని రౌద్రముగా బలికెను. ఒకపెద్దబాలుడు ముందునకువచ్చి "అయ్యా, పంతులుగారు బ్యాంకిలో డబ్బుదాచుకొని డబ్బులేదని జబ్బుచేసిన కొమార్తెకు మందువేయకపోతే ఆపిల్ల చచ్చిందండి. అప్పటినుండి పంతులుగారికి బ్యాంకిఅంటే కోపము"అని చెప్పెను. అంత నాయధికారి బుచ్చిరాజువైపు చురచురజూచి "బుచ్చిరాజు! నీ వుద్యోగమున కర్హుడవుగావు. కన్నపిల్లను జంపినవాడవు; పరులపిల్లలయెడ ప్రేమతో ప్రవర్తించుట కల్ల! ఉద్యోగమునకు తగవని వ్రాయుచున్నా"ననెను. "అయ్యా, పేదవాడను, అన్యాయముచేయకండి. పిల్లలాపదమును పాడ పూనికేని నేను వారినేమి చేయనండీ"యని బుచ్చిరాజు అధికారి పాదములపై బడెను. అధికారి "నేను స్వయంకృషిచే తెచ్చుకొనినపదవియు యుద్యోగమునువలె తీసివేయ సాధ్యము కాదు" అని ప్రత్యుత్తరమిచ్చి బసనుండి వెడలిపోయెను. పిల్లలు యెప్పటివలెనె పాటలు పాడుకొనుచు నిండ్లకేగిరి. అధికారానధికారముల లెక్క సేయనిదిగదా బాల్యస్వాతంత్ర్యము!

పాఠశాలాధికారి వెళ్లిన కొలదిదినములకు బుచ్చిరాజు నాగ్రామమునుండి బదలాయించినట్లు పైనుండి యుత్తరువు వచ్చెను. పాపము! బ్యాంకిపేరుచేత పదునాలుగు సంవత్సరములనుండి స్థిరనివాసమేర్పఱచుకొనియున్న గ్రామమును బుచ్చిరాజు విడవలసివచ్చినది. బుచ్చిరాజాగ్రామమును విడలేక పైకి మనవిచేసికొనెను. స్వయముగా వెళ్లి యధికారుల వద్ద మొత్తుకొని వచ్చెను. కాని యుత్తరువు తిరుగలేదు. వెళ్లనే వెళ్లినాడు.

పూనినకర్మము పొరుగూరు పోయినను పోదనినట్లు, ఊరువదలినను బుచ్చిరాజుకు పేరు వదలలేదు. అక్కడివారికిగూడ బుచ్చిరాజు బ్యాంకిపేరు క్షణములో తెలిసినది. అక్కడగూడబుచ్చిరాజు దళ్లరిబ్రతుకేమైనది. మరల బుచ్చిరాజును మఱియొకయూరికి బదలాయించిరి. అక్కడగూడ నిదేగోల. ఈ రీతిగా బుచ్చిరాజు బ్యాంకిపేరుచేత పల్లెటూళ్లలో పడుచుదక్కక మరల పెనాలిచేసికొన్నాడు.

ఊదినకొలఁది యుబికెడు రబ్బరుతిత్తి వలె బుచ్చిరాజుకథ వ్రాసినకొలది విస్తరి

చేసెద. సారములేని బుచ్చిరాజుగాథ నింత విస్తృతముచేయుట చదువరుల యమూల్యకాలమును దుర్వినియోగము చేయుటయగునను శంకచే కొంకుగలిగెడిని. మన్నింపవేడికోలు.

బుచ్చిరాజు నాటకసంఘములకు చిర మిత్రుడగుటచే మరల నందు చేరినాడు. కాని వయసు మరలినవాడగుటచే నాయిక పాత్రము ధరించుట కర్హుడుగాక యప్పుడప్పుడు చేటికా, చెలికత్తె యిత్యాదిపాత్రములను మాత్రమే ధరించి తన నటనాకౌశలమును ప్రదర్శించుచుండెను.

ఒకనాడు ఉదయ మగుసరికి తెనాలి పురమునందలి యేయెత్తుగోడలపై జూచినను, ఏగూడెద్దుబండిపై జూచినను, ఏజట్కా బండిపై జూచినను, "శాకుంతలము" నేటి రాత్రి ప్రదర్శింపబడునను పెద్దయక్షరములుగల ప్రకటనపత్రములే కానవచ్చెను. బెజవాడయు, చెన్నపురి సింహపురులనుండి యేతెంచిన సుప్రసిద్ధనటరత్నములు శకుంతలా దుష్యంతపాత్రముల ధరియింతురనికూడ యాప్రకటనలయందు వివరింపబడియుండెను.

తెనాలిపౌరులకే కాక యాపురము చుట్టుపట్టులనుండెడి గ్రామస్థులకుగూడ నాటకములు గాంచెడి దప్పి యెక్కువ. గుంటూరు వంటి పెద్దనగరములో వందలు పోగుచేయని నాటకసంఘములు తెనాలిలో వేలు మూటగట్టెను. నాడు ప్రధానపాత్రల ధరించువారు సుప్రసిద్ధనటకులని తెలియుటచే నేలకొలది టిక్కెట్లు పగలు పదిగంటలకే యమ్ముడుపోయినవి. స్థలసంకోచముచే నావల టిక్కెట్లు నమ్ముట మానవలసివచ్చినది. నాడు జనులు సాయంత్రము ఏడుగంటలనుండియే నాటకశాలకు రాజొచ్చిరి. ఎనిమిదిగంటల కప్పుడే నాటకశాల జనులతో క్రిక్కిరిసిపోయెను. ఆవల వచ్చినవారికి నిలుపుజీతము, త్రోపుళ్లు ప్రాప్తమయ్యెను. సరిగా తొమ్మిదిన్నరగంటకు నాటకము ప్రారంభమైనది. జనుల యల్లరి తగ్గినది.

ఇతరరంగములతో బనియేమి మనకు? శకుంతల చెలులతో గలసి చెట్లకు నీళ్లుపోయు రంగము వచ్చినది. దానిలో మన బుచ్చిరాజుగూడ శకుంతల కొకచెలియై నటనసలిపెను. నిజ శిరశిరోజములు సగముగప్పెడు సవరగట్టిన నల్ల వెంట్రుకలకృత్రిమపు కీలుగంటుజారుముడితో, పొగచూరిన వంటయింటి గోడకు వేసిన సున్నపుపూతవలె కడునల్లనిమోముపై సద్దిన ఫేస్‌పౌడరు అందముతో, పూర్వసువాసినీత్వమును స్ఫురింపజేయు సంచుకమ్ములు లేని పెన్లనలునతో, నూర్ధ్వశరీరము నిముడించి వంచిన వంగిని నిడుపుగాళ్లతో, జలకలశహస్తుడై రంగమున నవతరించినాడు. కొంటె కోణంగి యెవ్వడో బుచ్చిరాజును క్షణములో గుర్తుపట్టినాడు. 'బ్యాంకీ,' అని యొక్కయీల వైచినాడు. ఆవొక్కకేక వెంట పదికేకలు లేచినవి; ఆపదితో వందలు బయలుదేరినవి; ఆవందలతో వే లుప్పతిల్లినవి. సహజముగా నుడుకుబోతగు బుచ్చిరాజున కాకేకలు చెవిసోకుటతోడనే యొడలు కంపము పుట్టినది. శివమెత్తినవానివలె నైనాడు. అంత తనయునికి మఱచి, పని మఱచి, చేతిలోని జలకలశమును నేలగొట్టి, ఒడలున తొడిగిన

రవిక యుట్లేయుండ, పైటను, కుచ్చెళ్లను నేకముచేసి గుదిపట్టి నడిగోచిపెట్టి నెత్తిమీాది మాయజుట్టు కట్టుత్రాళ్లు సడలి కంఠహారమై మెడను వ్రేలాడుచుండ రంగస్థలమునుండి ప్రేక్షకసమూహములోని కొక్కదూకు దూకి నాడు. ప్రేక్షకులు బుచ్చిరాజు నేమిచేసిరో, బుచ్చిరాజు ప్రేక్షకుల నేమిచేసెనో, వివరము తెలియదు. సభ చిందరవందర యైనది. నాటకము భగ్నమైనది. సుప్రసిద్ధనటకుల నటనాకౌశల్యము గాంచ కుతూహలురై యేతెంచిన పెద్దమనుష్యు లాశాభంగము నంది, ధననష్టమునకు చాల్పడి కొంపల కేగినారు. వేడుకలను వినోదములను భగ్నముచేయవచ్చెడి తుంటరిసంఘమునకు మాత్రమే నాడు కనులపండు వైనది. నాడుమొదలు బుచ్చిరాజు మరల యెప్పుడుగూడ నాటకరంగమున గన్పడలేదు. నాటకసంఘాధికారులు గూడ నాతని మరల పిలిచియుండరు బహుశః.

# మల్లెపూవు

సహదేవ సూర్యప్రకాశరావు గారు

గుబుసుగా విరివిగఁ జూచి గుప్పగుప్ప
మనుచుఁ దావి దిగంతము లల్లుకొనఁగఁ
జేసి నీదు సత్వమును ఘోషింతువు మధు
మాసవాసరములయందు మల్లెపూవ!

పెంపెసఁగ వసంతాగమవేళయందు
చంద్రికాధౌతయామినీ సమయమందు
రమ్యతరుగణ విలసితారామవీథి
ఫుల్లమై ప్రకాశింతువు, మల్లెపూవ!

భాసుర మనోజ్ఞమృదులపుష్పములయందు
రమ్యము గులాబియే, సుమరాజ్ఞియనుచు
నెంతురేకాని, నీకున్నయంత తావి
మార్దవము మసృణములేదు మల్లెపూవ!

జగతి మూఢుఁడు నీదివ్యసౌకుమార్య
విలసనము చవిఁజూడక విడుచునేని
విడుచుఁగాక నీజాతికి విన్నదనము
మలినము గలుగనేర్చునే మల్లెపూవ!

సరసప్రత్యూష పవన ప్రసారమునను
వాహినీవక్షమున లేచు భంగపంక్తి
వలె హృదంతర్గతమున భావంబు లెన్నొ
వెల్లివిరియును నినుఁ జూడ మల్లెపూవ!

దివ్యచంద్రాతపములోని తెల్లఁదనము
మలయ పవనాంకురములోని చలువఁదనము
పరగ శ్రీచందనములోని పరిమళంబు
వెల్లివిరియును నీలోనె మల్లెపూవ!